# కంచాల కథ

అమ్మ తన అన్న మనుమరాలి పెండ్లికి అనంతపురం వెళ్ళి వచ్చింది. వస్తూనే, కొండంత వార్త మోసుకొచ్చింది. ఆ పెండ్లికి 'నారప్ప' మావయ్య వచ్చాడట.

నారప్ప అంటే మా అమ్మ పెత్తల్లి కొడుకు - 'నారాయణరావుగారు'. నాకు మావయ్య వరసన్నమాట. ఆయనో పోలీసాఫీసరు. ఏపాటి పోలీసాఫీసరో నాకు తెలియదు. ఆ మాటకొస్తే ఆయనగారిని నేను చూడలేదు.

ఆయనగారిని చూడలేదంటే అమ్మ వప్పుకోదు. "చూడకపోవటమేమిటి. చూసావు. నీవు చిన్నవాడివిగా వున్నప్పుడు, వాడు మద్రాసులో చదువుకొంటూ వుండే వాడు. మీ నాన్నగారికపుడు నెల్లూరులో నౌకరి. వాడు మదరాసు వెళుతూ, వస్తూ, మనింటికి వచ్చి, ఒక పూటైనా వుండి వెళ్ళేవాడు. వచ్చినప్పుడల్లా, నిన్ను ఎత్తుకుని 'ఒసే! వరక్కా వీడు కలెక్టరవుతాడే' అని మురిసిపోయేవాడు" అంటూ జ్ఞాపకం చేసేది. అంటే నాకు, రెండు మూడేళ్ళ ప్రాయపు నాటి మాటన్నమాట.

అమ్మ నారాయణరావు మామయ్యకు, నాకు వున్న అనుబంధపు గుర్తుగా చూపే మరో జ్ఞాపిక, మా అటక మీదున్న మూడు చక్రాల సైకిలు బండి. ఆయన గారు నా కోసం ప్రత్యేకించి తెచ్చారట. ఇవేవి జ్ఞాపకం లేవు నాకు. నాకు ఊహ వచ్చాక ఆయన మా యింటికి వచ్చిన దాఖలా లేదు.

అమ్మ నిట్టూర్చుతూ మరోమాట అనుకొనేది - "వాడికి పోలీసు ఆఫీసరు ఉద్యోగం అయింది - తీరిక కరువయింది. ఆపై బదిలీలపై బదిలీలు. కదా

చిత్తుగా బంధుగుల పెండ్లిళ్ళలో కలసేవాడు. ఆ తరువాత అదేం నౌకరీనో! దేశాటనయిపోయింది - వాడి పని. పది, పన్నెండేళ్ళుగా వాడి వూసే తెలియటం లేదు'' అని.

అలాంటి మావయ్య అనంతపురం పెండ్లిలో హఠాత్తుగా ప్రత్యక్షమై అమ్మను ఆనందాశ్చర్యాలలో ముంచేసాడు.

"అరే బాబీ!నీవు పేపర్లు దిద్దటానికి హైదరాబాద్ వెళతావుగా 'నారప్ప' వుండేది అక్కడేట. ఒక్కసారి కలుసుకో-" అంది అమ్మ.

ఇంతకూ ఆయన గారి ప్రస్తుత హోదా గాని, ఆఫీసుగాని, ఏమిటో తెలుసు కుంది కాదు అమ్మ.

"హైదరాబాదులో ఎవర్నడిగితే చెప్పరు కనక" అంటుంది. ఇంతకూ నారాయణ రావు మావయ్యను కలుసుకోమనటంలో ఆయనగారిపట్ల అమ్మకున్న అభిమానం, ఆత్మీయతల్ని అలా వుంచితే, మరో ముఖ్య కారణమొకటుంది.

అదే మా 'కంచాల' కథ. అదేమంటే....

ఈపాటికి ఆరు నెలలు దాటిపోయిందనుకొంటా.... గుంటూరులో జరగనున్న మా మరదలు పెండ్లికి 'బంధుమిత్ర సపరివారంగా' అన్నారు కదా అని, ఇల్లు తాళం వేసి ఇంటిల్లిపాదీ కదలి వెళ్ళాం. తిరిగి వచ్చేపాటికి మా బెడ్‌రూములో వున్న గాడ్రెజ్ బీరువాను అతి లాఘవంగా బద్దలుకొట్టి, అందులో వున్న మూడు వెండి కంచాలను పట్టుకు పోయారు దొంగలు. ఇంటి వెనకాల కిటికీ ఊచలను వంచి లోపలకు వచ్చిన దొంగలు, వెళుతూ తలుపుల గడియలు తెరచుకుని దర్జాగా వీధి మార్గానే వెళ్ళినట్లున్నారు.

ఒకందుకు సంతోషించాను. అమ్మవి, మా ఆవిడని బంగారు నగలు, పెండ్లి కదా, పట్టుకవెళ్ళాం. లేకుంటే అవీ ఆ బీరువాలోనే వుండేవి.

"ఆ పెద్ద అరటాకు వెండి కంచం..... వంద తులాలది మా పుట్టింటి వారిచ్చారు-" అంటూ అమ్మ గొడవ అంతింత కాదు. దానిని చూచుకొంటే తన పుట్టింటి వైభవం, జ్ఞాపకాలు కళ్ళకు కట్టినట్లుంటాయి అమ్మకు పాపం! ఆ తతిమా రెండు కంచాలు, నా పెండ్లిలో లాంఛనాలక్రింద లభ్యమైన బాపతు.



"బంగారం లాంటి కంచాలు ఎవరు పొట్టన పెట్టుకొన్నారో, ఏమో!" అమ్మ కళ్ళ నీళ్ళెట్టుకుంది.

'అవి బంగారపు కంచాలు కాదుగా... వెండివే కదా' అని ఓదార్చటానికి ప్రయత్నించాను.

"వెండివే కావచ్చు. కానీ ఆ అరటాకు కంచం నాకు బంగారం కంటే

ఎక్కువ. మీ నాన్నగారు దానిలో తప్ప మరేనాడూ మరో కంచంలో తిని ఎరుగరు. దానిని చూస్తుంటే.... ఆ మహారాజు మన పెద్ద పీట మీద బాసిపట్లు వేసికొని, ఆ కంచంలో భోజనం చేస్తున్న దృశ్యమే కనుల ముందుంటుంది-"

నా శ్రీమతి అమ్మంత కాకపోయినా విచారంగానే వుంది. పోగొట్టుకొన్న వస్తువుల విలువకంటే మానసికంగా వాటితో వున్న అనుబంధం అమ్మనూ, శ్రీమతినీ కలచి వేసింది. ఆ మాటకొస్తే వాటి ఈనాటి విలువ తక్కువేం కాదు.

పోయిన వస్తువులు తిరిగి రావటమా... పోలీసు రిపోర్టివ్వటం అనవసరం అనుకొన్నాను. ససేమిరా కాదు రిపోర్టివ్వవలసిందే అంది అమ్మ. ఆమెను తృప్తి పరచటానికి అలాగే రిపోర్టిచ్చాను.

దొంగతనం జరిగిన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించటానికొచ్చిన సబ్ ఇన్‌స్పెక్టరుతో - "మీ డిపార్టుమెంటులో మా 'నారప్ప' వుండాలి నాయినా. వాడికి కనక తెలుస్తేనా, క్షణాల మీద ఆ దొంగ ముండావాళ్ళను పట్టుకొని, చేసిన వెధవ పనికి నాలుగు వడ్డించును-" అంది అమ్మ.

అమ్మ మాటలు విన్న సబ్ ఇనస్పెక్టరు - ఆమె గారి మాటలో 'నారప్ప' గారిపట్ల మెచ్చుకోలు కన్నా, తమ అసమర్థత ఎడల వ్యాఖ్యే ఎక్కువ వుందనుకొన్నాడో ఏమో - "మా డిపార్టుమెంటులో నారప్పలూ, నాచప్పలూ ఎవరూ లేరు-" అంటూ చిన్నపాటి విసురుతో సమాధానం చెప్పి, నాతో - "చూస్తామండి. ఈ రోజే అన్ని స్టేషనులను ఎలర్టు చేస్తాను." అనేసి, పనిలో పనిగా- "అయినా ఇంటిలో ఎవరూ లేకుండా ఎలా వెళ్ళారండి" అని నాలుగు చివాట్లు పెట్టి మరీ వెళ్ళాడు.

"వీడి పొగరు పొడిచెయ్య! 'నారప్ప' ఎవరో తెలియదంటాడేమిరా!" అమ్మ విస్తుపోయింది.

ఆ పై ప్రతి నిత్యం 'అబ్బాయ్ పోలీస్ స్టేషనుకు వెళ్ళి వచ్చావా? అని అమ్మ అడగటం; వీలు చూచుకొని ఏ రెండు మూడు రోజులకో నేను వెళ్ళి రావటం. నేనలా వెళ్ళినప్పుడు పోలీసులు సవాలక్ష ప్రశ్నలు - ఎలాంటి వంటే... ఆ దొంగలెవరై వుండవచ్చని మీ అభిప్రాయం? మీ కెవరి మీద అనుమానం? మీ యింటికి ఆ ముందు రోజులలో వచ్చిన బంధువులా, మిత్రులా పేర్లేమిటి ?

ఇలాంటివి వేసి వేసి - చివరకు "సరేలెండి దర్యాప్తు చేస్తాం, మీరెందుకు అనవసరంగా మా చుట్టూ తిరగటం" అనటం రివాజయిపోయింది.

ఓ రోజు స్టేషన్ రైటరు నన్ను చూసి ఎందుకనో జాలిపడిన చేతస్కుడై - "మాస్టారూ! ఏనాటి 'తెఫ్ట్' కేసండి బాబు మీది. ఆ తరువాత నలభయ్ 'తెఫ్ట్' కేసులు రిపోర్టయ్యాయి. ఏవి తేలాయి కనక? - మీ కేస్ మూసేశాం కూడ" అని తేల్చి చెప్పాడు. వాళ్ళ అమ్మాయి నా స్టూడెంటుట. అందుకని జాలితో ఈ సమాచారం నా చెవినేసాడు.

ఆ నాటితో పోలీసు స్టేషనుకు నీళ్ళు వదిలేసాను. కాని అమ్మ మాత్రం తన 'నారప్ప' తమ్ముడి ఆచూకికై ఆరా తీస్తూనే వుంది - 'శ్రమ వీడని విక్రమార్కునిలా'-

ఇదిగో ఈనాటికి అతగాణ్ణి తన అన్న మనుమరాలి పెండ్లిలో పట్టేసింది. ఇద్దరూ ఒకరినొకరు చూచుకొని ధారాపాతంగా కళ్ళనీళ్ళెట్టేసుకొన్నారుట. 'ఒరే నారప్పా' అంటూ అమ్మ, 'అవునే వరక్కా' అని ఆయనా తనివి తీరా కబుర్లు చెప్పు కొన్నారట.

అదిగో ఆ తరుణంలో తన యింటిలో జరిగిన దొంగతనాన్ని గురించి ఏకరువు పెట్టి తనకూ, ఆ వందతులాల వెండి కంచానికీ వున్న అనుబంధాన్ని కళ్ళకు కట్టినట్లు చెప్పేసి - "అరే, నాయినా, నారప్పా! ఇక భారం నీదే" అనేసిందట అమ్మ.

ఆయనగారు వివరాలన్నీ "నోట్" చేసికొని - "నీవేం బెంగ పడకే వరక్కా! నేను సూస్తానుగా" అని భరోసా యివ్వటం జరిగిపోయిందట.

"మా 'నారప్ప' ను కలిసి ఎన్నాళ్ళో అయిందా!.... అయితే మాత్రం, ఎంత ఆత్మీయతా; ఎంత ఆదరణా! ఆ బంధుప్రీతి చిన్నమెత్తు తగ్గిందా. నన్ను చూస్తూనే 'వరక్కా... వరక్కా' అంటూ ఎంత యిదైపోయాడో!"

"వాడు పెండ్లి కొచ్చాడని ఎలా తెలిసికొన్నారో... ఆ వూళ్ళో వున్న పోలీసులంతా బార్లే తీరారా బరాబరులే చేసారా... అడుగడుక్కు మడుగు లొత్తారు. వాడి నోటి నుండి మాట వచ్చిందే తడవు పరుగు పందేలలో పరుగు లంకించుకొన్నట్లు పరుగు లెత్తారు. ఎన్ని కార్లో! ఎంతమంది పరిజనమో-"

అంటూ చెప్పి అమ్మ బోలెడు సంబరపడి పోయింది.

అమ్మ చెప్పిందాంట్లో కొంత 'ఉత్ప్రేక్ష' వుందనుకొన్నా 'నారాయణరావు మావయ్య- ఓ మోస్తరు పెద్దాఫీసరులానే వుందే' అనిపించింది.

దొంగలు పడిన ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లు ఎంత పెద్దాఫీసరు కల్పించుకొంటే మాత్రం - "ఆటల పోటీలో గెలిచిన జట్టు నాయకుడు 'ట్రోఫీని' రెండు చేతులతో పైకెత్తి ప్రేక్షకులందరికీ చూపినట్లు - ఆ దొంగల నాయకుడు, దొంగిలించిన కంచాల దొంతరను ఈ పోలీసులకు ప్రదర్శిస్తూ దొరికి పోతాడా...." అనిపించింది.

"నారప్ప నిన్ను చూడాలని తెగ యిదై పోయాడనుకో... నాతోపాటు, యిటే వచ్చును కూడ.... కాని హైదరాబాదులో పుట్టి మునిగే పనులు బోలెడు కనిపెట్టుకున్నాయట."

"వరక్కా! వాడినే ఒకసారి భార్యతో కలిసి రమ్మను అని మరీ మరీ చెప్పాడు" అంది అమ్మ.

అమ్మ పెండ్లి నుండి తిరిగి వచ్చిన రెండవనాటి సాయంత్రమనుకొంటా 'పటేల్', కోర్టు నుండి తిరిగి వచ్చేపాటికి, ఇద్దరు కానిస్టేబుళ్ళు, మా గుమ్మానికి అటు, ఇటూ ద్వారపాలకుల్లా నిలచివున్నారు. లోపల హాల్లో 'అటెన్షన్' పోజులో నిలువబడిన బుర్ర మీసాల సబ్ ఇన్స్పెక్టరు అతివినయంగా మాట్లాడుతూ, కన్పించాడు. నన్ను చూస్తూనే ఓ పోలీస్ సెల్యూట్ కొట్టాడు. గతంలో ఎన్నిసార్లు 'స్టేషన్' కెళ్ళి 'గుడ్‌మార్నిం'గంటూ పలుకరించినా తిరిగి 'విష్' అయినా చేయని ఆ బుర్రమీసాల ఆసామియేనా ఇతగాడు అనిపించింది.

"ఏమిటి?" అన్నాను.

"పోయిన మన కంచాల వివరాలడుగుతున్నారు. రేపటికల్లా పట్టేస్తారట" అంది అమ్మ.

అనవసరంగా మరోసారి సెల్యూట్ కొట్టి "అవునుసార్" అన్నాడు ఆ బుర్ర మీసాలు.

"మీరా కేసు మూసేసారేమో?"

"అయినా పరవాలేదు సార్... మళ్ళీ తెరుస్తాం... తెరిచాం కూడ. పోతే మీరొక్క సాయం చేయాలి. మా దగ్గర మీరిచ్చిన 'కంప్లైంటు' కేస్ మూసివేయటంతో ఎక్కడో 'మిస్‌ప్లేస్' అయింది. అయినా ఫరవాలేదు. ఆ కాపీ ఒకటి మీ దగ్గరుంటే, ఇచ్చారంటే చాలు. రేపటి సాయంత్రానికల్లా పని పూర్తి చేసి జిల్లా యస్.పి. దొరగారికి 'కంప్లయన్సు' రిపోర్టు పంపేస్తాను."

"పని పూర్తి చేయటమంటే-?"

"అదే సార్! తమ సొత్తు తమకు అప్పగించి యస్.పి. దొరగారికి వైర్‌లెస్ సెట్‌లో చెప్పేయటమే."

నాగది లోని షెల్ఫ్ అంతా వెతికి కంప్లైంటు కాపీ తెచ్చి యిచ్చాను. దానిని కళ్ళకద్దుకున్నంత పని చేసి మరోమాటు సాల్యూట్ కొట్టి "తమ దర్శనం రేపు చేసికొంటాను" అంటూ సెలవు పుచ్చుకుని మరీ వెళ్ళాడు.

అతగాడటు వెళ్ళగానే "వీడి బండబడ! ఇంకా నారప్ప ఎవరో తెలియదంటాడేమిరా?" అంది అమ్మ.

కారణం వూహించి చెప్పాను.- "నారాయణరావు మావయ్య జిల్లా యస్.పి. కంటే పై నుండే ఆఫీసరన్నమాట. సబ్ ఇన్‌స్పెక్టరు లాంటి బక్క ప్రాణానికి ఆయనెవరో తెలియటం కాని, ఆయన దర్శనం కలగటం కాని జరగదు" అని.

ఆ మరునాటి మధ్యాహ్నం సబ్ ఇనెస్పెక్టరు తన జీపులో నన్ను సకల మర్యాదలతో పోలీసు స్టేషనుకు తీసికొని వెళ్ళాడు. అక్కడ తన టేబులు మీదున్న కొన్ని వెండి కంచాలను చూపి, "తమరిష్టమొచ్చిన మూడు కంచాలను ఎన్నిక చేసికొని తీసికోండి" అన్నాడు.

అతగాడనేదేమిటో నా కర్థం కాలేదు.

"మరేం లేదండి. ఈ సాయంత్రానికల్లా తమ సొత్తు తమకు ముట్టిందని జిల్లా సూపర్నెంటు గారికి రిపోర్టివ్వాలండి. మీ అసలు సొత్తును ఈ క్షణాన 'ట్రేస్' చేయటం కష్టం కదండి. అందుకని వాటికి బదలకా వీటిని...."

అర్థం అయింది నాకు. ఆ కంచాలను పరికించాను. కొత్తగా మెరుగు పెట్టబడిన పాత కంచాలవి. వాటిపై మాసిపోక 'మైదవోలు సుబ్బారావు' అని

కొన్నింటిపైనా... 'తాడికొండ రత్తమ్మ' అని కొన్నింటిపైనా.... ఇలాటి వేవో కన్పిస్తున్నాయి. నా మనస్సంగీకరించలేదు.

"ఎవరివో మాకెందుకు.... మావి దొరికితేనే యిద్దుర్లెండి..." అన్నాను.

"ఎవరివో మీ కివ్వటం కాదు సర్. ఇవి 'అన్ క్లైమ్డు' ప్రాపర్టీ. ఇలా ప్రతి స్టేషనులోనూ వుంటాయి. ఫరవాలేదు. తీసుకోండి" ప్రాధేయపడ్డట్లు మాట్లాడాడు.

"మరికొంత కాలం వేచి ఉండటానికి మా కెలాంటి అభ్యంతరమూ లేదు. మా సొత్తు 'ట్రేస్' అయ్యాకే ఇవ్వండి" అని వచ్చేసాను.

రాత్రి భోజనాల దగ్గర మూడు సరికొత్త వెండి కంచాలు ప్రత్యక్ష మయ్యాయి. ఆశ్చర్యపోయాను. వాటిపై రెండిపై నా పేరు - మరో దానిపై నాన్నగారి పేరు వేసి వున్నాయి. సాయంత్రం సబ్ఇన్స్పెక్టరు వచ్చి వాటిని యిచ్చి వెళ్ళాడట.

"ఎందుకు తీసికొన్నారు?" - విసుక్కున్నాను.

"అవి మీకు చూపిన మెరుగు పెట్టిన పాత కంచాలు కావు. 'మోహన్ లాల్ జ్యూయలర్స్'లో కొన్న కొత్త కంచాలు" అంది శ్రీమతి.

"అయితే మాత్రం?" చిరాకు పడ్డాను.

"అరేయ్! బాబీ! పాపం, ఆ ఇన్స్పెక్టరబ్బాయి - 'దొడ్డమ్మగారూ! ఈ నాటి సాయంత్రానికి సొత్తు మీకు ముట్టినట్లు రిపోర్టు పోకుంటే - 'మీ నారప్ప' దొరవారు, నన్నే కాదు నేనున్న పోలీస్టేషన్ను కూడా 'ఉప్పు పాతర వేస్తారు' అంటూ కాళ్ళా వేళ్ళా పడ్డాడు. పోనీలే పాపం అని అప్పటికీ మీ ఆవిడ వద్దు వద్దంటున్నా తీసికొన్నాను. వెర్రి నాగన్నకు యిప్పటికి అర్థమయింది. 'నారప్ప' అంటే ఏమిటో" అంది అమ్మ. మరేం చేయగల్గింది లేక వూరుకుండిపోయాను.

ఆ నెలలోనే 'స్పాట్ వాల్యుయేషన్'కు హైదరాబాద్ వెళ్ళ వలసి వచ్చింది.

"నారప్పను చూడటం మానేవు సుమీ!" అని అమ్మ పలుమార్లు హెచ్చరించటమే కాకుండా అసలాయనగారెంతటి ఆఫీసరో తెలిసికోవాలన్న ఉత్సుకత కూడా పురికొల్పగా, ఆయనగారి కోసం పోలీసు కంట్రోలు రూములో వాకబు చేసాను. నారాయణరావు పేరుతో ఒకరిద్దరు కానిస్టేబుళ్ళు తప్ప మరెవ్వరూ లేరక్కడ. పోలీసు కమీషనరు కార్యాలయానికి వెళ్ళి వాకబు చేయండన్నారు

వాళ్ళు. వెళ్ళాను; ఆ పేరుగల పెద్ద ఆఫీసర్లు లేరక్కడ. మరికొన్ని కార్యాలయాలు గాలించి, చివరి ప్రయత్నంగా డి.జి.పి. ఆఫీసుకెళ్ళాను.

అదిగ్గో అక్కడ దొరికాడు - యన్.ఆర్.కె. చర్ల, ఐ.పి.యస్. అనే నామ ధేయంతో 'నారప్ప' గారు ఐ.పి.యస్. అవుతూనే కంచర్ల నారాయణరావు కాస్తా యన్.ఆర్.కె. చర్లగా మారిపోవటంతో, మా బోంట్లకు నారాయణరావు అనే చిరునామాకు అందకుండా వుండిపోయాడన్నమాట, ఇన్నాళ్ళూ!

ప్రస్తుతం ఆయన ఉద్యోగం ఐ.జి.పి. (క్రైమ్స్). మహా అట్టహాసంగా వున్న ఎ.సి.రూములో అమ్మ చెప్పినట్లే తన క్రింద వుండే దండనాథులంతా నిటారుగా నిలువడి బరాబరులు చేస్తుండగా మహారాజ ఠీవిలో భద్రసింహాసనం లాంటి రివాల్వింగ్ చైరులో ఆసీనుడై కనిపించాడు.

నన్ను నేను పరిచయం చేసుకోగానే "మా 'వరక్క' బిడ్డడివి, బాబీవే!" అంటూ ఆప్యాయంగా కౌగిలించుకొని - "'ఎంతవాడివయ్యావయ్యా!... ఏనాడో 'ఇంత'వాడివిగా వుండగా చూసాను-" అంటూ మురిసిపోయాడు.

అమ్మ చెప్పినదాంట్లో ఇసుమంత కల్పన లేదు. ఆయనలో తానో పెద్ద ఆఫీసరునన్న 'ధిషణ' ఎక్కడా కన్పించలేదు. ముప్పయి ఏళ్ళ క్రిందట నెల్లూరులో తానెత్తుకొని ముద్దాడిన చంటివాణ్ణి లాలించినట్లే, "ఇంద, తాగు"అంటూ ఆర్డర్లీ తెచ్చి యిచ్చిన యాపిల్ జ్యూస్ నా నోటికి అందించినంత పనిచేసాడు.

కుశల ప్రశ్నలు వేసాడు. అందరినీ పేరు పేరునా అడిగి యోగక్షేమాలరసాడు. తన మద్రాసు చదువు.. మా నెల్లూరు నివాసం... నా బాల్యం, నాటి సంగతుల నెన్నింటినో జ్ఞప్తికి తెచ్చుకుని సింహావలోకనం చేసికొన్నాడు.

ఆయన నవ్వినపుడు, కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యంగా చూసినపుడు, అరమోడ్పు మాట్లాడి నపుడు, ఏనాటివో, నాలో చిన్ననాటి స్మృతుల యవనికలు కదలాడి అందులో మావయ్య మూర్తి తొంగిచూసిన అనుభూతి కలిగింది.

తాను ఐ.పి.ఎస్, అయ్యాక కొద్ది కాలమే మన రాష్ట్రంలో పనిచేశాడట. ఆపై పలు రాష్ట్రాలకు, పలు హోదాలలో డిప్యుటేషను మీద తిరగడమే సరిపోయిందట.

"ఈ ఉద్యోగ ధర్మం కాదుకాని, స్వరాష్ట్రాన్ని, స్వజనాన్ని వదలి, తిరిగిన

చోట తిరగక, జీవితమంతా నిర్విరామంగా తిరిగి, విసుగొచ్చేసిందనుకో- మీ అత్తయ్య బహుశా నాతో ఈ తిరుగుళ్ళు పడలేకనేమో, 'మీ వెంట తిరిగిందేమో తిరిగాను, ఇక నావల్ల కాదీ తిరుగుళ్ళు, చివరిగా ఆ తిరుగులేని చోటకే నా ప్రయాణం' అన్నట్లు, నన్నొంటరిగా వదలి వేసి, ఆ భగవంతుడి దగ్గరకు వెళ్ళి పోయిందోయ్! ఆపై భయంకరమైన వంటరితనాన్ని తట్టుకోలేకపోయాను. ఏమైనాసరే, నా రాష్ట్రానికి తరలి పోతానని పట్టుపట్టి మరో రాష్ట్రంలో పైహోదా యిస్తామన్నా వదలుకొని వచ్చేసాను. వచ్చానేమో - 'వరక్క' లాంటి ఆత్మీయుల్ని చూడగల్గాను" చెప్పేరు మావయ్య.

హోటలు నుండి తన బంగళాకు నా బస మార్పించి, నేనక్కడ వున్నంత కాలం, తన దగ్గరే వుంచుకొని, నా తిరుగు ప్రయాణానికి ముందు, ఈసారి నెల రోజుల లోపల, మా అమ్మను, ఆవిడను తీసికొని మళ్ళీ వస్తానని మాట పుచ్చుకొని మరీ వదిలాడు మావయ్య.

హైదరాబాద్ నుండి తిరిగి వచ్చిన వారం రోజులకు స్పెషల్ క్రైమ్ బ్రాంచి 'డి.యస్.పి.'ట వచ్చి, "మాస్టారూ! ఇవి మీ కంచాలేమో చూడండి" అంటూ తన వెంట జవాను మోసుకొచ్చిన సూట్ కేస్ నుండి తీసి చూపాడు.

అవును, అవి మావే! ఆరు నెలల క్రిందట దొంగిలించ బడిన మా కంచాలే, వాటిపై స్పష్టంగా నాన్నగారి పేరు, నా పేరు కన్పిస్తున్నాయి.

ఓ పెద్ద ఆరితేరిన దొంగల ముఠా పనిట యిది. ఎక్కడో ఆదిలాబాదు జిల్లాలో దొరికిపోయారట. వాళ్ళవద్ద ఎంతెంతో బంగారం, వెండి, కరిగించింది, కరిగించాల్సింది దొరికిందట. మా కంప్లైంటు ఐ.జి.పి. గారి నోటీసులోకి వెళ్ళటం వలన డొంకంతా కదలిందన్నమాట. మరో మూడు నెలల్లో, ఆఘమేఘాల మీద 'కేస్'ను కోర్టులో తెమిల్చి మా కంచాలను లోకల్ పోలీస్ స్టేషన్ ద్వారా మాకిచ్చారు.

అవి మాకందుతూనే గతంలో మాకిచ్చిన 'మోహన్ లాల్ జ్యూయలర్స్'లో కొన్న కంచాలను తిరిగి ఇవ్వబోయాం.

"అమ్మమ్మ! ఎంత మాట - అవి మీదగ్గరే వుంచుకోండి" అన్నారు.

"అబ్బే! అవి మాకెందుకు నాయనా! మా కంచాలు మాకొచ్చాయి అంతే

చాలు. వాటిని పట్టుకెళ్ళం"డని పట్టుపట్టింది అమ్మ.

"అలా కాదులెండి. మీ సొత్తు వెదకి పట్టుకోవటానికి తొమ్మిది నెలలు పట్టింది. ఈ అపరాధానికి మమ్మల్ని మన్నించాలి. జరిగిన జాప్యానికి ముదరాగా వాటిని మీరుంచుకోవాల్సిందే! మీరిక మా కోర్కె మన్నించాల్సిందే-" అంటూ అమ్మ కాళ్ళ మీద పడిపోయినంత పనిచేసాడా ఇన్స్పెక్టరు.

"కాదులే నాయనా! అంతగా మీకు మాట వస్తుందని భయంగా వుంటే - మా 'నారప్ప'కు నే చెప్పి వప్పిస్తా" అంది అమ్మ.

ఇన్స్పెక్టరు ఈసారి కళ్ళ నీళ్ళు పెట్టేసుకొన్నంతై, "వద్దండి దొడ్డమ్మ గారూ! ఈ విషయం వారి నోటీసు వరకు వెళ్ళకూడదు. వెళ్ళిందా ఎన్నో విషయాలను బయటకు లాగి మరెన్నో ప్రశ్నలు వేసి, తీగ లాగి, డొంకంతా లాగి, డొంకనంతా కదిల్చి, మా చర్మాలను వలిచేసి, ఎండేసి, దాంతోనే 'యూనిఫారం' కుట్టించేస్తారు." అంటూ అమ్మ ముందు సాష్టాంగ పడిపోయాడు.

"సరేలే! లే, నాయనా" అనేంత వరకూ లేచాడు కాదు.

అలా ఆ కంచాలను త్రిప్పి ఇవ్వటం మా చేతనయింది కాదు.

★ ★ ★

'కంచాల కథ' అంతటితో అయిపోలేదు. మూడేళ్ళు గడిచింది. ఈలోగా మా 'నారాయణరావు మావయ్య' డి.జి. పి. అయి రిటైరు అయ్యారు. కొడుకు 'స్విట్జర్లెండు'లో, ఇండియన్ యంబసీలో పెద్ద ఆఫీసరు. అతగాడి దగ్గరికి వెళ్ళిపోయాడు కూడ.

నారాయణరావు మావయ్య ఉనికి మూలంగా ఈ మూడేళ్ళుగా నిర్భేద్యమైన పోలీసు వలయం మమ్మల్ని చుట్టివున్నదన్న భావన మాలో పాతుకుని పోయిందో ఏమో కించిత్ ఆదమరచినట్టున్నాము. ఈసారి డైనింగ్ టేబుల్ మీదనే వదలివేయబడిన మూడు కంచాలతో పాటు ఆ ప్రక్కనే షెల్ఫ్‌లో వున్న మరో మూడు కంచాలను, వెరసి ఆరింటిని, తలుపులకు తాళాలు వేయక, వాటిని దగ్గరగా వేసికొని, ఆరుబయట మంచాల మీద నిద్రపోతున్న మాకెవ్వరికీ నిద్రా భంగం కలుగనీయకుండా దొంగిలించుకు వెళ్ళారు - దొంగలు.

ఈసారి వచ్చిన దొంగలు వట్టి బద్ధకపుముండా వాళ్ళలా వున్నారు. ఆ ప్రక్క గదిలోనే వున్న 'గాడ్రెజ్' బీరువా పగల కొడితే మరికొంత విలువైన బంగారు నగా నట్రా దొరికేవే. కానీ ఆ బీరువా జోలికి పోలేదు వాళ్ళు.

వాళ్ళ బద్ధకానికి జోహార్లు అర్పించాను. ఈసారి అమ్మ చాల దిగులు పడి పోయింది. తమ్ముడు 'నారప్ప' ఉద్యోగం నుండి దిగిపోవటమే కాక... కాని దేశానికి తరలి పోయేడాయె - మరి!

పోలీసు రిపోర్టిచ్చాను. నేను మాజీ డి.జి.పి. నారాయణరావు గారి తాలూకు అని చెప్పేను. కొత్తగా వచ్చిన ఆసబ్ ఇన్‌స్పెక్టరు వెటకారంగా చూసి, "తలుపు తాళాలైనా వేసికోకుండా వదలివేసి పడుకోమని ఆయనగారు, సలహా యిచ్చారా!" అని ప్రశ్నించాడు. "చూస్తాం లెండి," అని తుంచేసినట్లు మాట్లాడాడు.

మరో మూడునెలలకు నాకు కాకినాడ బదిలీ అయిపోయింది.

మా ఆవిడ తన పుట్టింట్లో, ఏదో శుభకార్యానికెళుతూ అమ్మను కూడ పట్టుబలవంతాన తనతో తీసికొని వెళ్ళింది.

కాలేజీలో నా కొలీగ్ భానుమూర్తి, "ఒంటరిగావున్నట్లున్నారుగా, ఈ నాటికి మా యింట్లో భోంచేద్దురుగాని రండి!" అంటూ లాక్కెళ్ళాడు తనింటికి.

నాకు అరటి ఆకులోను, భానుమూర్తికి వెండి కంచంలోను వడ్డించింది వాళ్ళావిడ. ఎందుకో, యాదృచ్ఛికంగా చూసిన నాకు కొత్త మెరుగుతో మిల మిల లాడుతోన్న భానుమూర్తి ముందున్న వెండి కంచంపై చెరగి పోకుండా వున్న నాన్నగారి పేరు కన్పించింది.

నా మొహంలో ఆశ్చర్యాన్ని దాచుకోలేకపోయాను.

"ఏమిటి?" ప్రశ్నించాడు భానుమూర్తి,

"మరేం లేదు. మీ బంధువుగాని, ఎవరైనా పోలీసాఫీసరున్నారా?"

"అవును. ఉన్నారు. ఇదిగో ఈవిడగారి మేనమామ ఈ రేంజి డి.ఐ.జి. ....ఏం?"

"మరేం లేదు. మీ ఇంట్లో గాని ఈ మధ్య దొంగలు కాని పడ్డారా?"

"అరె! మీ కెలా తెలుసు?" ఆశ్చర్యపోయాడు భానుమూర్తి.

నాకెలా తెలుసో... మా కంచాలనక్కడ చూచాక, భానుమూర్తికి చెప్పటం భావ్యం కాదనిపించింది. "అబ్బే! ఎవరో అంటేను..." అని ఆ ప్రసంగాన్ని అంతటితో ముగించాను. ●

## కథ వెనుక కథ :

మిత్రులు, కీ.శే ద్విభాష్యం వెంకట్రాయుడు శాస్త్రి గారు, వారి బంధువుల ఇంటనో, స్నేహితుల ఇంటనో జరిగిన ఓ దొంగతనాన్ని, ఆ దొంగిలించ బడిన సొత్తు తిరిగి లభ్యమైన తీరును గురించి చెప్పిన ఉదంతమే ఇది. అయితే ఆరు కంచాలు రావటంతో ఆగిపోయిన కదథకు మరో దొంగతనాన్ని సృష్టించి, ముగింపుకు బలాన్ని కల్పించటం జరిగింది.

★ *(రచన సచిత్ర మాసపత్రిక, సెప్టెంబర్ 1992)* ★